క్లుప్తంగా

ముక్కోటి భక్తులకు వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఉత్తరద్వార దర్శనానికి వచ్చిన భక్తులకు అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పురవీధుల్లో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పరవాడ: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కె.అప్పలనాయుడు, కె.శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ స్వామి వారి పల్లకీని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, ముత్యాలనాయుడు, నారాయణరావు, కన్నంనాయుడు, నరసింహమూర్తి, ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, అధిక సంఖ్యలో భక్తులు, మాతృమూర్తులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన



బాల్ బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో గత నెల 29 నుంచి 31 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. జట్టులో వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆర్.లోకేశ్వరి, ఎం.శ్యామల, వి.వినీలా విశేష ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.ఖగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి తదితరులు విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

డ్వాక్రా బజార్‌లో రికార్డు స్థాయి విక్రయాలు

- ఒక్కరోజులోనే రూ.52 లక్షల కొనుగోళ్లు



లిల్లీపుట్ నృత్య ప్రదర్శన లో కళాకారులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలభారత డ్వాక్రా బజార్ సరస్ 2022లో రికార్డు స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజులో రూ.52,31,044 విలువచేసే కొనుగోళ్లు జరిగా యి. దీంతో గత ఆరురోజుల్లో జరిగిన నమ్మకాలు రూ.1,55,40,451కి చేరుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో నగరం నలుమూ లల నుంచిపెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వస్తువులు కొనుగోలు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు డ్వాక్రా బజార్ కొనసాగుతుంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏడో రోజు కార్యక్రమాలలో భాగంగా స్నేహాంజలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. మురిపాల గోపాల...అంటూ చిన్నారుల స్వాగత గీతంలో ప్రారంభమైన కార్యక్రమాలు వేయినామాలు....ముద్దుగారే ...,బ్రహ్మమొక్కటే తదితర శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేదిని, హారికల లిల్లీపుట్ నృత్యం కడుపుబ్బ నవివ్వస్తూ అందరి మనసులను హత్తుకుంది. సంక్రాంతి సంబరాలు, ధింసా నృత్యం మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచాయి. పెద్దసంఖ్యలో నగరవాసులు హాజరై కార్యక్రమాలను తిలకించారు.

ఉత్తర ద్వార దర్శనం.. పులకించిన భక్తజనం



సింహగిరిపై స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వెంకటాద్రిపై స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు
- జనసంద్రంగా సింహగిరి
- మార్మోగిన గోవింద నామస్మరణ

సింహాచలం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని విభిన్న రూపాల్లో కొలువైన స్వామిని దర్శించుకోవడానికి సోమవారం వేకువ జామునుంచే భక్తులు ఆయా ఆలయాలకు తరలివచ్చారు. ఆలయాల నిర్వాహకులు స్వామి ఉత్సవమూర్తుల చెంత విశేష పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులు కనులారా స్వామిని వీక్షించి తరించారు.

➡ పెందుర్తి వెంకటాద్రిపై స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కనులపండువగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామనుజమ్ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ , వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, 96వవార్డు అధ్యక్షుడు ఎల్.బి.నాయుడు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

సింహాచలంలో...

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్నను ఆలయ ఉత్తరద్వారం వద్ద వేదికపై అధిష్టంపజేశారు. ఉదయం 5గంటల నుంచి 10 గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

వివిధ ఆలయాల్లో ..

జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీ రామాలయంలో స్వామివారి ఉత్తరద్వార దర్శనం భక్తులకు అందజేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, చినముషిడివాడలోని అలివేలుమంగమ్మ ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కల్పించారు.

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

సింహాచలం: సింహగిరిపై ఉత్సవం నిర్వహణలో దేవస్థానం అధికారుల మధ్య సమన్వయం కొరవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఉదయం ఆలయ ఉత్తరరాజ గోపురంలో స్వామి దర్శనాలు ప్రారంభం కాగానే.. అక్కడ నుంచి మూలవిరాట్ దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయ ధ్వజస్తంభం ప్రాంగణం అంతా ఒక్కసారిగా కిక్కిరిసింది. రూ.500 ఉత్తర ద్వార టికెట్లు తీసుకున్న భక్తులతో పాటు, టికెట్లు లేకుండా కూడా పెద్ద ఎత్తున భక్తులు ధ్వజస్తంభం ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికప్పుడు భక్తులను నియంత్రించేందుకు ఆ ప్రాంతంలో మెస్‌లు ఏర్పాటు చేశారు. అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఉత్సవ అధికారి సురేష్‌బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై కూడా కొంతమంది దేవస్థానం అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు హాజరవుతున్న తమను అడ్డుకోవడంపై ప్రశ్నించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు కూడా పరిమితికి మించి తమ వెంట ఎక్కువ మందిని తీసుకొచ్చి దర్శనం చేయించారన్న విమర్శలు వెల్లువెత్తాయి.



సింహాచలం దేవస్థానానికి చెందిన వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వారంలో స్వామి



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు



స్వామిని దర్శించుకుంటున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తదితరులు



సింహగిరిపై స్వామిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు, కర్రిస్వామి



పెందుర్తి వేంకటాద్రిపై ఉత్తరద్వారంలో వేంజేసిన వేంకటేశ్వరస్వామి



స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి

సబ్బవరం: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సబ్బవరం సీతారాముల ఆలయంతో పాటు గొర్లివానిపాలెం,పెదనాయుడుపాలెం, రావలమ్మపాలెం, మల్లునాయుడుపాలెం , అసకపల్లి,అమృతపురం,దేవీపురం,గుల్లేపల్లి బంగారమ్మపాలెం గ్రామాల్లోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,భజనలు నిర్వహించారు.

అభినందనలు



సింహాద్రి జీజీఎం సిన్హాకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నూతన ప్రాజెక్టు హెడ్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ కుమార్ సిన్హాను సోమవారం ఐఎన్‌టీయూసీ (ఎన్ఎంయూఎస్) జనరల్ సెక్రటరీ బి.భీమరాజు, యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంస్థ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని తెలిపారు.

పరమ శివా.. పాహిమాం



పూజలందుకున్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి కి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారిని కుంకుమతో అర్చించారు. ఓం నమః శివాయ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు ప్రకటనలో తెలిపారు.

బాబు ప్రచార పిచ్చితో జనాలకు ఇబ్బందులు



సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- ప్రాణాలు పోతున్నా పట్టడడం లేదు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ధ్వజం

సబ్బవరం: చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి ప్రజల ప్రాణాలమీదకు తెస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మండిపడ్డారు. ఆయన పని తీరు వీక్ .. పబ్లిసిటీ పీక్ అన్నచందంగా ఉందని ఎద్దేవా చేశారు. మండలంలోని ఆరిపాక సచివాలయం పరిధిలోని యాతపాలెం ఎమ్మెల్యే అదీప్ రాజ్ సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రచార యావతో ఇరుకు సందుల్లో మీటింగ్‌లు పెట్టి అనేక అనర్థాలకు కారణమవుతున్నారన్నారు. తన పబ్లిసిటీ స్టంట్‌తో గతంలో గోదావరి పుష్కరాల్లో అనేక మందిని పొట్టన పెట్టుకోగా.. మళ్లీ అమాయకుల మృతికి కారణమయ్యారని ఆరోపించారు. చంద్రబాబు సైకిల్‌ని ఇంటికి పంపించేయాలని చెబుతున్నారని ఆయన చెబుతున్నట్టే వచ్చే ఎన్నికల్లో జరుగుతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాతపాలెంలో రోడ్డు,డ్రైనేజీ సమస్యను సచివాలయానికి ఇచ్చిన రూ.20 లక్షల నిధులతో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే దండి కోనేరులో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరుల క్షేత్రం వద్ద రూ.3 లక్షలతో స్నానాల ఘాట్ ఏర్పాటుకు ఆయన చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, సర్పంచ్ పాలిశెట్టి పార్వతి,వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము,మాజీ ఎంఈపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, మండల పార్టీ కన్వీనర్ కర్రిబాబు, నాయకులు బొడ్డేటి మహాలక్ష్మినాయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్, యడ్ల నాయుడు, బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన పండగ



పరవాడలో పింఛన్లు అందజేస్తున్న రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు



తానాంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సన్యాసిరాజు

ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ

పరవాడ: వారం రోజుల పాటు పెన్షన్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా పరవాడ గ్రామంలో సోమవారం సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడుతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవ్వతాతల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పథకాన్ని రూ. 3 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ నెరవేర్చే దిశగా ప్రస్తుతం రూ.2750 పింఛన్ ఇస్తున్నారని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్ పథకం వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు పైల హరీష్, వెంకటరావు, పోతల అప్పలనాయుడు, వర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

➡ తానాం గ్రామంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు సోమవారం అవ్వతాతలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన రూ.2750 పింఛన్‌ను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు.

బీసీ జనగణన చేపట్టాలని వినతి

అల్లిపురం: బీసీ జన గణన జరిగేలా కేంద్రప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సభ్యులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఆయన్ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్ కల్పించడం, బీసీలకు క్రీమిలేయర్ తొలగించడం తదితర అంశాలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించేలా చూడాలని కోరారు. జీవీఎల్ మాట్లాడుతూ బీసీ జన గణన రాష్ట్రాల వారీగా జరిగితే త్వరితగతిన పూర్తవుతుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌తో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం సభ్యులు కోటా రమేష్, కె.రామ్‌కుమార్, కొయ్య రామకృష్ణ, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు, సీనియర్ బీసీ సంఘం నాయకుడు కర్రి రాము తదితరులున్నారు.

ఆశా కార్యకర్తల్లో సేవా భావం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


ఆరిలోవ: ఆశా కార్యకర్తలు సేవా భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన ప్రాంతాల ఆశా కార్యకర్తలకు ఇక్కడ 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఇక్కడ శిక్షణ ద్వారా పొందిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మాతా శిశు సంక్షేమ శాఖ వైద్య సేవలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎస్ఎంఏ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలాకుమారి, డాక్టర్ బి.ఉమావతి, డీపీహెచ్ఎన్‌వో సత్యవతి, హెచ్ఈఈవో మణికుమారి, డీసీఎం లక్ష్మి, హెచ్ఈ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: గత నెల డిసెంబర్ 31వ తేదీ రాత్రి డీఆర్ఎం కార్యాలయం వద్ద కారు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయి. చామన ఛాయ కలిగి, నలుపు, తెలుపు గెడ్డంతో ఉన్నాడని, ఎరుపు రంగు స్వెట్టర్, బూడిద రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించాడని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04716, 94407 40864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నవరస భరితం.. నృత్య రూపకం



నృత్యాభినాయంలో కళాకారుడు

మద్దిలపాలెం: నవరసాల సమ్మేళనంతో కూచిపూడి నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. దశావతారాలను ఒకే నాట్యంతో పాటు చక్కని హావభావాలను పలికించి ప్రేక్షకులను మైమరపించారు. పంచమ వేద నృత్యార్చనతోపాటు, అర్ధనారీశ్వరాంతర్యంను ఎంతో చక్కగా అభినయం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు. శివపంచాక్షరిని, ఆనందతాండవమును నృత్యాతాండవంతో ఉర్రూతలూగించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం అంబికేశ్వరి కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ 45వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వందేళ్లుగా తమ అకాడమీ నృత్యకారులను తయారు చేస్తోందని అకాడమీ అధ్యక్షుడు, నాట్య గురువు విజయ భరణిశంకర్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొన్నారు.